క్లుప్తంగా

భోజిరెడ్డికి సన్మానం



చంద్రశేఖర్‌రెడ్డికి మిఠాయి తినిపిస్తున్న భోజిరెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఈ మధ్యనే బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొంగరి భోజిరెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం ఖేడ్‌లో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి శాలువాలతో సన్మానించి మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

మహాసభలను జయప్రదం చేయండి

జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ నాయకురాలు సాక్షి

పటాన్‌చెరు: ఏప్రిల్ 4,5 తేదీల్లో జోగిపేటలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలు జరగనున్నాయని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకురాలు సాక్షి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సంఘం ఎస్‌ఎఫ్‌ఐ అని అన్నారు. చదువుతూ పోరాడు, చదువుకై పోరాడు నినాదంతో ఎస్‌ఎఫ్‌ఐ అనునిత్యం విద్యారంగ సమస్యలపై పోరాడుతుందన్నారు. విద్య రంగం ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి మహాసభ చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. పటాన్‌చెరు ప్రాంత విద్యార్థులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద మరమ్మతులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ప్రధాన చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేస్తున్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం ఇక్కడ వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. 134వ జయంతి ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విగ్రహం చుట్టూ ఉన్న వాటర్ ఫౌంటేన్, గ్రిల్స్, టైయిల్స్ దెబ్బతిన్నాయి. ఇటీవల మరమ్మతులు చేయాలని దళిత సంఘాల నాయకులు మున్సిపల్ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన కమిషనర్ ఉమామహేశ్వర్‌రావు మరమ్మతులు పనులు చేయిస్తున్నారు.

ముస్లింలకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు అందజేస్తున్న సభ్యులు

నారాయణఖేడ్: నిరుపేద ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని పేద ముస్లి కుటుంబాలకు నిత్యావసర కిట్లను పంపిణీ చేశారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి, లయన్ల క్లబ్ జిల్లా డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి వివిధ సామగ్రి కిట్లను అందించారు. లయన్ క్లబ్ అధ్యక్షుడు వెంకట్‌రావు, ఇతర బాధ్యులు పండరినాథ్, చంద్రశేఖర్, రవికుమార్, రాజ్‌కుమార్, అబ్రార్, యూసూఫ్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



తాగునీరు అందిస్తున్న బలరాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురంలోని సాయినగర్ కాలనీలో ఆదివారం బాలాజీ ఫౌండేషన్ చైర్మన్ బలరాం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కాలనీ అధ్యక్షుడు లక్ష్మణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానంగా వేసవిలో చలివేంద్రాలు ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. యువజన సంఘాలు ముందుకు వచ్చి ప్రధాన కూడలి వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నవ భారత్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీధర్, అరుష్ ఫౌండేషన్ చైర్మన్ నవీన్, విజయేందర్, సంతోష్, యాదగిరి, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

హత్నూరలో..

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రం హత్నూరలో సేవా భారతీయ ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది పండుగను పురస్కరించుకొని చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎండా కాలంలో ప్రయాణికులు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఊరురా ఉగాది వేడుకలు

నూతన సంవత్సరం ఉగాది వేడుకలను ఆదివారం జిల్లా వ్యాప్తంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రోధి నామ సంవత్సరానికి వీడ్కోలు పలికి విశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలికారు. ఉదయం నుంచే ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దీంతో దేవాలయాలు కిటకిటలాడాయి. సాయంత్రం వేద పండితులు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు.



నారాయణఖేడ్: పచ్చడిని పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్యసంఘం బాధ్యులు



పటాన్‌చెరు టౌన్: పంచాంగ శ్రవణంలో పాల్గొన్న నీలం మధు



కల్హేర్: మార్డిలో ఉగాది పచ్చడి పంపిణీ



సదాశివపేట పట్టణంలో పచ్చడి తాగుతున్న పూర్వ విద్యార్థుల మిత్ర బృందం



కంగ్టి(నారాయణఖేడ్): రాజారాంతండాలో..



పటాన్‌చెరు టౌన్: ఆలయ ఆవరణలో భక్తులు



వట్‌పల్లి : కన్‌సాన్‌పల్లి గ్రామంలో..



న్యాల్‌కల్: రేజింతల్ సిద్ధివినాయక ఆలయంలో..



జహీరాబాద్ టౌన్: రుక్మిణిపాండురంగ ఆలయంలో పంచాగ శ్రవణం ..



హత్నూర: షేర్ఖాన్‌పల్లి ఆలయంలో..

భక్తిశ్రద్ధలతో కలశయాత్ర ఊరేగింపు



కలశయాత్రలో పాల్గొన్న మహిళలు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ఒడిశా బీహార్‌కు చెందిన మహిళలు పెద్ద ఎత్తున కలశయాత్ర కార్యక్రమం చేపట్టారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని చేపట్టిన కలశయాత్రలో మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి దంపతులు పాల్గొని మున్సిపల్ వీధుల్లో కలశాలతో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. దారి పొడవున జైదుర్గామాత నినాదాలతో వీధులు దద్దరిల్లిలాయి. అనంతరం దుర్గామాత ఆలయంలో మహిళలతో కలిసి చంద్రారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా కలశయాత్ర చేపడుతున్న మహిళలను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చంద్రారెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు దీనానాథ్, శ్రీమన్నారాయణ, రాజారాం, మా అంబి మహిళా సేవాసమితి సభ్యులు, పరం, శీలాదేవి, దుర్గావతి, దేవి, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన 'మార్కెట్' ఆదాయం

- ప్రతిఏటా పెరుగుతున్న ఆదాయం
- రెండేళ్లుగా లక్ష్యానికి మించి రాబడి

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ లాభాల పరంపర కొనసాగిస్తోంది. గడిచిన రెండేళ్లలో అదనపు ఆదాయం ఆర్జించింది. పత్తి క్రయవిక్రయాలు పెరగడం, ఆర్థిక సంవత్సరం ముగింపుకాలానికి ముందస్తుగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) చెల్లింపులు జమచేయడం, పాత బకాయిలు వసూలు కావడంతో ఆదాయం వృద్ధి చెందింది. మార్కెటింగ్ శాఖ నిర్దేశించిన లక్ష్యానికి మించి వట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ ప్రత్యేకతను చాటుతోంది.

చెల్లింపులు జరిగి..

వట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఏటా కనిష్ఠంగా రూ.50 లక్షల నుంచి గరిష్ఠంగా రూ.65 లక్షల వరకు ఆదాయం వస్తుంది. అయితే రెండేళ్లుగా గతానికి భిన్నంగా ఎక్కువ ఆదాయం వచ్చింది. సీసీఐ ఆధ్వర్యంలో గతేడాది 71 వేల క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు జరపగా రూ. 49.70 లక్షలు మార్కెట్‌కు ఆదాయం రాగా, ఈ ఏడాది 83 వేల క్వింటాళ్ల కొనుగోలు చేయగా రూ.61.77 లక్షలు రావాల్సి ఉండగా కొనుగోలు తాలూకా ప్రస్తుతం 60 శాతం సీసీఐ మార్కెట్‌కు జమ చేసింది. మిగతాది వచ్చే ఏడాది జమనున్నట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. పాత బకాయిలు రూ.24 లక్షలు వసూలయ్యాయి. దీంతో ఏటా వచ్చే రూ.50 లక్షల ఆదాయానికి తోడు ఈ ఏడాది రూ.96.47 లక్షలు అదనంగా ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.



వట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

వ్యవసాయ మార్కెట్ నిర్దేశించిన లక్ష్యాలు

సంవత్సరం	టార్గెట్	సాధించింది (రూ.లక్షలలో)
2022-23	78.64	49.67
2023-24	65.57	67.29
2024-25	95.96	96.47

పెరిగిన పత్తి విక్రయాలు..

వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో గతేడాదితో పోలిస్తే ఈసారి పత్తి విక్రయాలు బాగా పెరిగాయి. మండలంలో 22 వేల ఎకరాల విస్తీర్ణంలో తెల్లబంగారం సాగైంది. ప్రకృతి సహకరించకపోడంతో పత్తి దిగుబడి తగ్గినప్పటికీ గతేడాది కంటే 10 వేల క్వింటాళ్లు సీసీఐ పత్తి కొనుగోళ్లు చేసింది. పత్తి విక్రయాలు పెరగడంతో మార్కెట్ ఆదాయం కూడా పెరిగింది.

సీసీఐ కొనుగోళ్లు పెరగడంతో...



ఈసారి మద్దతు ధర దక్కడంతో రైతులు చాలా వరకు సీసీఐ ద్వారానే పత్తిని విక్రయించారు. దళారులకు విక్రయించి మోసపోవద్దని రైతులకు అవగాహన కల్పిస్తున్నప్పటికీ ప్రైవేట్ కొనుగోళ్లు కూడా జరిగాయి. అయినా గతేడాది కంటే 10 వేల క్వింటాళ్లు సీసీఐ కొనుగోళ్లు పెరడగంతో ఆదాయం వృద్ధి చెందింది. ఆర్థిక సంవత్సరం ముగింపులోగా సీసీఐ మార్కెట్ ఫీజు చెల్లించింది. పాత బకాయిలు కూడా వసూలు కావడంతో మార్కెట్‌కు అదనంగా ఆదాయం సమకూరింది.

- సునీల్‌కుమార్, మార్కెట్ కార్యదర్శి

హైందవ ధర్మం కోసం పాటుపడాలి

బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి

జహీరాబాద్ టౌన్: హైందవ ధర్మ రక్షణతో పాటు హిందువుల ఐక్యతకు యువత పాటుపడాలని భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) జాతీయ ఉపాధ్యక్షుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని మాణిక్‌ప్రభు మందిరంలో ఆదివారం హైందవ సామూహిక ప్రార్థన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హిందూ సమాజం ఐక్యతలేని కారణంగా అనేక రకాల సమస్యలను ఎదుర్కొంటున్నామని విచారం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని యువత గుర్తించి హిందువులు ఏకతాటిపైకి రావాలన్నారు. వికాస తరంగిణి నిర్వాహకులు సాయిరెడ్డి విఠల్ రెడ్డి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలకు సంస్కారం నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపల్లి మల్లికార్జున్, కొత్తకాపు సుభాష్‌రెడ్డి, వెంకటయ్య, సురేందర్‌రెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి, తదితరులు

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

జోగిపేట(అందోల్): జోగిపేట లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ రవీందర్‌గౌడ్ హాజరయ్యారు. అధ్యక్షుడిగా రవిశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సంతోష్, కోశాధికారిగా మున్నూరు మల్లేశం, ఉపాధ్యక్షుడిగా మధుసూదన్ రెడ్డి, డాక్టర్ జాన్‌పాల్, జాయింట్ సెక్రటరీగా శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ.. జోగిపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ట్రస్టును ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్దామని రవీందర్‌గౌడ్ అన్నారు. దీనికి సంబంధించి ఏకగ్రీవ తీర్మానం చేశారు.



రవిశేఖర్‌రెడ్డి (అధ్యక్షుడు)



సంతోష్‌కుమార్ (కార్యదర్శి)



మల్లేశం (కోశాధికారి)

కోహీర్ వాసికి డాక్టరేట్ ప్రదానం

జహీరాబాద్: కోహీర్ పట్టణానికి చెందిన వేదప్రకాష్ జోషి సంస్కృత సాహిత్యంలో పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఇటీవల తిరుపతిలో నిర్వహించిన రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం 4వ స్నాతకోత్సవంలో విశ్వవిద్యాలయ రిటైర్డ్ కులపతి ఎస్.గోపాలస్వామి, ఉపకులపతి జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. 'పంచమహాకావ్య–ప్రయుక్త–క్రియాపదావనా వైచిత్ర్య పరిశీలనమ్' (పంచమహాకావ్యాలలో క్రియా పదాల ప్రయోగ వైచితి) అను అంశం నందు ఆచార్యులు కె.రాజగోపాలన్ పర్యవేక్షణలో 2004 సంవత్సరంలో వేదప్రకాష్‌జోషి పరిశోధన పూర్తి చేశారు. రాష్ట్రంలో సంస్కృత భాష అధ్యయనం కనుమరుగవుతున్న నేటి కాలంలో పంచమహాకావ్యాల్లో జరిగిన ఈ పరిశోధన చాలా విశిష్టమైనది. అందులో మొత్తం 8,113 శ్లోకాలు, 10,033 క్రియ పదాలు కలవు. వాటిలో విశిష్టమైన క్రియాపదాల ప్రయోగం ద్వారా కవి చమత్కారం ఏవిధంగా ఉంటుందో విశ్లేషిస్తూ చేసిన ఈ పరిశోధనతో పంచమహాకావ్యాలను అర్థం చేసుకోవడంలో ఒక నూతన దృష్టి కోణాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. సంస్కృత విశ్వవిద్యాలయాన్ని నిర్మించి మరిన్ని పరిశోధనలు తెలంగాణలో జరిగేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.



డాక్టరేట్‌ను అందుకుంటున్న వేదప్రకాష్‌జోషి

తప్పించుకున్న చైన్‌స్నాచర్



జహీరాబాద్ టౌన్: పట్టణంలోని మహీంద్రకాలనీలో శనివారం రాత్రి చైన్‌స్నాచర్ హల్‌చల్ చేశాడు. ఓ మహిళ మెడలోని బంగారు పుస్తెల తాడును తెంపుకొని పారిపోతుండగా ఆమె ప్రతిఘటించింది. స్థానికులు అతడిని పట్టుకుని చితకబాదారు. పెనుగులాటలో తప్పించుకుని పరారయ్యాడు. స్నాచర్ ఫొటోను సెల్‌ఫోన్‌లో బంధించారు. చైన్‌స్నాచర్ ఆచూకీ లభిస్తే జహీరాబాద్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కాశీనాథ్ చెప్పారు.

నేడు పాలవిక్రయ కేంద్రాలు ఏర్పాటు

నారాయణఖేడ్: పట్టణంలో రంజాన్ సందర్భంగా సోమవారం విజయడైయిరీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పాలవిక్రయ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ డేవిడ్ తెలిపారు. పట్టణంలోని హష్మీ, ఇబ్రహీమ్యా, ఖురేషి, ఇలాహీ మసీదుల వద్ద పోలీసుఠాణా, ఖేడ్ జంట గ్రామం మంగల్‌పేటలోని జీవన్ గంగావాటర్ ప్లాంట్ల వద్ద ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రూ.75లకే లీటరు పాలను విక్రయించనున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రత్యేక పూజలు



మునిపల్లి(అందోల్): ఉగాదిని పురస్కరించుకొని దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అంతారం జీవన్ముక్త సంస్థానంలో సంస్థాన పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహరాజ్ ఆధ్వర్యంలో పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయితో పాటు జీవన్ముక్త మహరాజ్, బుదేరాలో భ్రమరాంభ మల్లిఖార్జున స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదం, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి

నారాయణఖేడ్: గిరిజనుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని దిశ కమిటీ జిల్లా సభ్యుడు ప్రకాష్ రాథోడ్ తెలిపారు. గోరిబ్ బోలే భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేయడంపై సంతోషం వ్యక్తం చేవారు. ఈ సందర్భంగా ఆదివారం గిరిజనులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎనలేని చిత్తశుద్ధి ఉందన్నారు. మంత్రివర్గ విస్తరణలో లంబాడీలకు అవకాశం కల్పించాలని కోరారు. గిరిజన నాయకులు సురేష్‌నాయక్, రాథోడ్ రాజునాయక్, శ్రీరామ్, శంకర్‌నాయక్, రాజు, కల్యాణ్, రమేష్, మహేష్, వినోద్, రవి పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

4 నుంచి రాములోరి ఉత్సవాలు

కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: ఏప్రిల్ 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. శ్రీరామనవమి నేపథ్యంలో ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శ్రీ కోదండ సీతారామస్వామి దేవస్థానంలో స్వామి వారి కల్యాణం నిర్వహించేందుకు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ లగ్నపత్రిక రాయించి, 6న ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి కల్యాణ ముహూర్తంను వేద పండితులు నిర్ణయించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అల్లాడి శ్రీనివాసరావు, నరసింహచారి, శ్రీనివాస్‌చారి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, జలగరి ఎట్టయ్య , పోచారం కృష్ణయ్య పాల్గొన్నారు.



వేద పండితులతో సమావేశమైన కార్పొరేటర్

అదనపు తరగతి గదులు నిర్మించండి

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్రంలోని పూర్వ పాఠశాల సముదాయంలో తరగతి అదనపు గదులను నిర్మించాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు. అదనపు గదులను నిర్మిస్తే విద్యార్థులకు దూరభారం తగ్గుతుందని, ఇక్కడే చదువులు కొనసాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్‌రెడ్డి, ప్రదీప్ గౌడ్, సుధాకర్, ప్రవీణ్, రాములు, యాదగిరి, నర్సింలు, అశోక్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని ఇస్తున్న గ్రామస్తులు

అంబలితో ఉపశమనం

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): వేసవిలో అంబలితో ఉపశమనం పొందవచ్చని మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కల్హేర్ మండల కేంద్రంలో మాజీ ఉపసర్పంచ్ కుమ్మరిసాయిలు సౌజన్యంతో అంబలి కేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంసింగ్, మాజీ జెడ్పీటీసీ నర్సింహరెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎంఎ.ఘని, పీఏసీఎస్ చైర్మన్ గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ సంగప్ప, నాయకులు పాల్గొన్నారు.



అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తదితరులు

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన



కీర్తనలు ఆలపిస్తూ భక్తులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శివాలయం ప్రాంతంలో ఆదివారం 148వ నగర సంకీర్తన నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. హరేకృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలోని నాగదేవత ఆలయంలో నిర్వహించిన నగర సంకీర్తనలో భక్తులు పాల్గొన్నారు. ఆధ్యాత్మిక చింతన అలవచ్చుకోవాలని కంది ఇస్కాన్ ప్రతినిధి విభీషణ్ ప్రభు పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అల్పాహారం అందించారు.